
# పొగబండి కథలు



— జలేటి శ్రీనివాసభాను


కొత్త ఫీచర్ ప్రారంభం

బొగ్గుతో రైళ్లు నడిచే రోజుల్లో- ఆ సాయంత్రం ఏం జరిగిందంటే....

కారు మబ్బులు తారు డ్రమ్ముల్లాగా దొర్లుకొస్తున్నాయి. నీటితో బరువెక్కిన గాలి రివ్వుమంటోంది.


'వర్షానికి దొరికిపోతాను కాబోలు' అనుకుంటూ అరవయ్యోపడిలో కూడా పరుగులాంటి నడకతో పొలాల గట్ల మీంచి దూసుకుపోతున్నారు విశ్వనాథంగారు.

## తిరుగు ప్రయాణం



పిక్కబలం వున్న మనిషి గాలికి ఎదురొడ్డి గబగబా అడుగులేస్తున్నారు. త్వరగా స్టేషన్‌కి చేరుకోవాలి. సాయంత్రం ప్యాసింజర్ అందుకోవాలి. ఆ వేగంలో ఆయన తాటిపెండె దాటారు. జీడితోపుకి ప్రదక్షిణంగా వెళ్లారు. పంచె ఎగ్గట్టుకొని మోకాళ్లలోతు గెడ్డలోని జలగల్ని తప్పించుకొని నడిచారు. గట్టెక్కగానే అద్గదిగో చెయ్యూపుతూ పిలిచింది పేదరాశి పెద్దమ్మ కుటీరం లాంటి రైల్వేస్టేషన్. సిమెంట్ బెంచీ, తురాయి చెట్లూ, కిరసనాయిలుతో వెలిగే దీపస్తంభం, ఏనుగుతొండంలా వాటర్ కాలమ్...

పట్టాల మీద రోకలి బండలాగా పొడుగాటి గూడ్స్ ట్రెయిన్. దానికి రెండు స్టీమ్ ఇంజన్లు. అవి వాటర్ కాలమ్ దగ్గర బొజ్జ నిండా నీళ్ల తాగుతున్నాయి. కండలు తిరిగిన ఇద్దరు ఫైర్‌మెన్లు తలలకి గుడ్డలు చుట్టుకున్నారు. ఇంజన్ వెనుక భాగంలోంచి పునాది రాళ్ల సైజులో వున్న రాక్షసి బొగ్గుల్ని పెద్ద పారలతో అందుకొని ఫైర్‌బాక్స్‌లోకి విసురుతున్నారు.



విశ్వనాథం గారికి ఆ స్టేషన్ దగ్గర్లోని పల్లెటూళ్లో తాతలనాటి ఇల్లు, పొలాలూ వున్నాయి. ఆయన ఉద్యోగం నుంచి రిటైర్ అయ్యాక పట్నంలో కొడుకు దగ్గర వుంటున్నారు. పల్లెటూరి పాత ఇంటికి తాళం వుంది. పొలాలు కౌలులో వున్నాయి. ఏడాదికొకసారి ఆయన తమ గ్రామానికి వస్తారు. అప్పుడు నాలుగు రోజుల పాటు ఇంట్లో దీపం వెలుగుతుంది. రైతుల నుంచి కౌలు సొమ్ము వసూలవుతుంది. ఊళ్లో పలకరింపులూ, పాత జ్ఞాపకాలు ముగిశాక పట్నానికి తిరుగు ప్రయాణం మొదలవుతుంది. స్టేషన్ దగ్గర పడింది. అంతలోనే వాన. చేటలోని ధాన్యం గాదెలోకి రాలుస్తున్నట్లు సూదుల్లాంటి చినుకులు. విశ్వనాథం గారు ముందు చూపున్న మనిషి. జాగ్రత్తలు ఎక్కువ. చంకలోని గొడుగు తెరిచారు. ఎదురుగాలికీ, ఏటవాలు జల్లుకీ గొడుగు అడ్డంగా పెట్టుకొని గబగబా రైల్వేస్టేషన్‌లోకి చేరుకున్నారు.

స్టేషన్ బిల్డింగ్ చీకటిగా వుంది. ఏఎస్ఎమ్ లేతగా వున్నాడు. కొత్తగా సర్వీసులో చేరినట్లున్నాడు. కుర్చీలో తల వెనక్కి వాల్చి, రెండు కాళ్లూ టేబుల్ మీద చాపి, సిగరెట్ తాగుతున్నాడు. గాల్లో పొగ గుత్తులు గుత్తులుగా వేలాడుతోంది, గుప్పుమంటోంది.

''మాష్టారూ రాయ్‌పూర్ వెళ్లే ప్యాసింజర్ ఎలా వుంది?'' ద్వారం దగ్గర నిలబడి అడిగారు విశ్వనాథం గారు.

''నిక్షేపంగా వుంది'' పెద్దాయన మీద జోక్ పేల్చాననుకొన్నాడు కుర్ర ఏఎస్ఎమ్.

''మంచిది మాస్టారూ.. రైళ్లు నిక్షేపంగానే వుండాలి గానీ నా ఉద్దేశం రాయపూర్ వెళ్లే ప్యాసింజర్ లేటుగా నడుస్తోందా? రైట్ టైముకే వస్తోందా?''

''బయట బోర్డుంది. తాటికాయంత అక్షరాలు రాశాను''

''మీరు రాసే వుంటారు. కానీ వాన పడుతోంది కదా! సుద్దముక్క గీతలు వుంటాయా? అలుక్కుపోయాయి''

''సో వాట్? యూ వాంట్ మీ టు హోల్డ్ రెస్పాన్సిబుల్''

''సర్టెన్లీ నాట్. జస్ట్ ఐ వుడ్ లైక్ టు నో...'' విశ్వనాథం గారు వాక్యం పూర్తి చెయ్యలేదు. అంతలో కంట్రోలు ఫోన్ మోగింది. ఏఎస్ఎమ్ ఫోన్ అందుకున్నాడు. మాట్లాడాడు. ఆ స్టేషన్‌లో వాటరింగ్‌ను పూర్తి చేసుకున్న గూడ్స్ ట్రెయిన్‌ని లైన్ క్లియర్ తీసుకొని, పక్క స్టేషన్‌కి పంపించమంటూ కంట్రోలర్ నుంచి సూచన అందింది.

ఏఎస్ఎమ్ పక్క స్టేషన్‌తో బ్లాక్ ఫోన్‌లో మాట్లాడాడు. లైన్ క్లియర్ అడిగాడు. బ్లాక్ ఇన్‌స్ట్రుమెంట్‌లో నుంచి బొండాంలాగా గుండ్రంగా వున్న మెటల్ టోకెన్ భళ్లుమంటూ బయటకొచ్చింది. దాన్ని తీసుకొని ట్రెయిన్ రిజిస్టర్‌లో ఎంట్రీలు రాసుకొని 'అప్పన్నా' అని పిలిచాడు ఏఎస్ఎమ్. లైన్ క్లియర్ పోర్టర్ అప్పన్న అలవాటు ప్రకారం అక్కడ లేడు. స్టేషన్ బయట పాకా విలాస్‌లో గట్టిపకోడీలు నంజుకుంటూ టీ తాగుతున్నాడు.

''యూజ్‌లెస్ ఫెలో ఎప్పుడూ ఇంతే'' కుర్ర ఏఎస్ఎమ్ విసుక్కున్నాడు. అలా విసుక్కుంటూనే టోకెన్‌ని వెదురుతో చేసిన పౌచ్‌లో పెట్టాడు. కేబిన్ మెన్‌కి ఫోన్ చేసి, స్లాబ్ రిలీజ్ చేసి, స్టార్టర్ సిగ్నల్ వెయ్యమని చెప్పాడు.

బయట వర్షం తగ్గినట్టే తగ్గి మళ్లీ పుంజుకుంది. దానికి తోడు ఈదురు గాలి! ప్లాట్‌ఫారమ్మీది తురాయి చెట్లకి పూనకం వచ్చింది. అటూ ఇటూ ఊగాయి. విల్లులాగా ఒకే వైపు వంగాయి. అలా వంగడంతో పాటు తలలు సిమెంట్ బెంచీలకేసి బాదుకున్నాయి. లైన్‌క్లియర్‌ని ఇంజన్ డ్రైవర్‌కి అందజేయడానికి అప్పన్న ఇంకా రాలేదు. తప్పదు. ఆ పని కుర్ర ఏఎస్ఎమ్ చెయ్యాలి. ఇంజన్ దూరంగా వాటర్‌కాలమ్ దగ్గర వుంది. అక్కడి వరకూ హోరున కురుస్తున్న వర్షంలో నడిచి వెళ్లాలి. ఏఎస్ఎమ్ విసుక్కున్నాడు. ఉద్యోగాన్ని తిట్టుకున్నాడు. ఆ కోపాన్ని, విశ్వనాథంగారి మీద చూపించాడు.

''ఇక్కడ అడ్డంగా నిలబడకపోతే వెయిటింగ్ హాల్లో కూర్చోవచ్చు కదండీ!''

''అలాగే వెళతాను. ఈ గొడుగు వేసుకొని వెళ్లండి మాస్టారూ'' కుర్రాడి విదిలింపుని పట్టించుకోకుండా విశ్వనాథం గారు గొడుగుని ఏఎస్ఎమ్‌కి ఇచ్చారు.

కుర్రాడికి థాంక్స్ చెప్పే ఓపిక లేదు. గొడుగు అందుకొని ఇంజన్ వైపు పరుగు తీశాడు లైన్ క్లియర్ పట్టుకొని. ఎదురుగాలి బలంగా వీచింది. గొడుగు గాల్లో పల్టీలు కొట్టి, కమాన్లు విరిగి పోయాయి. ఏఎస్ఎమ్ వర్షంలో తడుస్తూ ఇంజన్ వరకూ వెళ్లాడు. డ్రైవర్‌కి లైన్ క్లియర్‌ని అందించాడు. స్టార్టర్ సిగ్నల్ పడింది. ఇంజన్‌లు రెండూ 'బయ్' మని కూతలు పెట్టి బయల్దేరే సమయానికి...

''స్టాప్.. స్టాప్.. స్టార్టర్ సిగ్నల్ డేంజర్'' అంటూ ఇంజన్‌లోని ఫైర్‌మెన్ గట్టిగా అరిచారు. అప్రమత్తంగా వున్న డ్రైవర్ వాక్యూమ్ రిలీజ్ చేసి, సడెన్ బ్రేక్ వేశాడు. కదలబోయిన గూడ్స్ ట్రెయిన్ పెద్ద కుదుపుతో ఆగింది. గూడ్స్ వేగన్‌ల బఫర్లు ఒకదానితో మరొకటి ఢీకొని పెద్దగా చప్పుడు చేశాయి. కారణం- గూడ్స్ ట్రెయిన్ వెళ్లేందుకు అంతవరకూ అనుకూలంగా వున్న స్టార్టర్ సిగ్నల్ హఠాత్తుగా డేంజర్‌లోకి మారింది. ఎందుకిలా జరిగిందో ఏఎస్ఎమ్‌కి అర్థం కాలేదు. పరుగు పరుగున స్టేషన్ బిల్డింగ్‌లోకి వచ్చాడు. అక్కడి దృశ్యాన్ని చూసి ఆశ్చర్యపోయాడు. విశ్వనాథం గారు బ్లాక్ ఇనుస్ట్రుమెంట్ ఫోన్‌లో పక్క స్టేషన్‌తో మాట్లాడుతున్నారు. పొరుగు స్టేషన్ మాస్టర్ ఇస్తున్న మెసేజ్‌ను రాసుకొని, వెనక్కి తిరిగి చూశారు. వానలో తడిసి ముద్దయిపోయి, చలికి వణికి పోతున్నాడు కుర్ర ఏఎస్ఎమ్.


''క్షమించండి మాస్టారూ. డ్యూటీలో వున్న ఉద్యోగి తప్ప ఇంకొకరు స్టేషన్‌లోని పరికరాల్ని తాకడం నేరం. ఒప్పుకుంటాను. కానీ ఏం జరిగిందంటే... మీరు లైన్ క్లియర్ తీసుకొని అలా ఇంజను దగ్గరకు వెళ్లగానే పొరుగు స్టేషన్ నుంచి బ్లాక్ ఇనుస్ట్రుమెంట్ ద్వారా 'అబ్‌స్ట్రక్షన్' సిగ్నల్స్ అదేపనిగా వెలువడ్డాయి. ఏదో ప్రమాదం ముంచుకొచ్చిందనీ, ఈ స్టేషన్ నుంచి గూడ్స్ ట్రెయిన్ బయల్దేరడం అపాయమనీ గ్రహించాను. అందుకే స్టార్టర్ సిగ్నల్‌కి అనుకూలంగా మీరిచ్చిన స్లాబ్‌ని, తక్షణమే 'పుట్‌బ్యాక్' చేసి, 'డేంజర్'లోకి మళ్లించి, గూడ్స్ ట్రెయిన్‌ని ఆపేందుకు ప్రయత్నించాను. నా ప్రయత్నం ఫలించింది. ప్రమాదం తప్పింది. ఈ స్టేషన్‌కీ, పొరుగు స్టేషన్‌కీ మధ్య కొండవాగు వర్షం వల్ల పొంగిపోయిందట. పావు కిలోమీటరు మేర ట్రాక్ కొట్టుకుపోయిందట. పక్క స్టేషన్ మాస్టర్ మెసేజ్ ఇచ్చారు. చూడండి'' అంటూ విశ్వనాథం గారు కుర్ర ఏఎస్ఎమ్‌కి మెసేజ్ కాగితాన్ని అందించారు.

''మెనీ మెనీ థాంక్స్... మీరు...'' కుర్ర ఏఎస్ఎమ్ ఆశ్చర్యంలోంచి తేరుకోలేదింకా! ఉన్నట్టుండి వాన వెలిసింది. గాలి శాంతించింది. కుర్ర ఏఎస్ఎమ్ సర్దుకునేలోగా- ''అయ్యా, పెద్ద మాస్టారూ నమస్కారం సార్ ఎప్పుడొచ్చినారు. ఏటి? రాయపూర్ ప్యాసింజర్‌కి ఎలిపోతున్నారేటి?'' అప్పుడే పాకా విలాస్ నుంచి స్టేషన్‌కి తిరిగొచ్చిన లైన్‌క్లియర్ పోర్టర్ అప్పన్న విశ్వనాథం గారిని పలకరించాడు.

ఆ స్టేషన్లో చాన్నాళ్లు పనిచేసి, అయిదేళ్ల క్రితం ఎస్ఎమ్‌గా రిటైర్ అయిన విశ్వనాథం గారిని గుర్తుపట్టలేకపోయినందుకు, తురాయి చెట్లూ, సిమెంటు బెంచీలూ, వాటర్ కాలమ్, స్టేషన్ బిల్డింగూ సిగ్గుపడ్డాయో లేదో కానీ- ఆ సీనియర్ సిటిజన్‌ని ఖాతరు చెయ్యకుండా మాట్లాడినందుకు కుర్ర ఏఎస్ఎమ్ మాత్రం తలదించుకున్నాడు.

కుర్రాడి చూపులు విశ్వనాథం గారి పాదాల్ని తాకాయి.

అలా తాకడంలో పశ్చాత్తాపం...కృతజ్ఞత పోటీపడ్డాయి.



## మల్లికా డిమాండ్!

మల్లికా షెరావత్తా మజాకా! ఇప్పటి వరకూ తెరపై ముద్దులకు, శృంగారపు ఆరబోతకు ప్రసిద్ధికెక్కిన మల్లికా ఇప్పుడు మరో సంచలనానికి తెరలేపింది. ఇప్పటి వరకూ బాలీవుడ్‌లో పెద్ద పెద్ద హీరోలు మాత్రమే తమ పారితోషికాన్ని ఏరియా రైట్స్, షేర్ వాటాల రూపంలో తీసుకుంటున్నారు. ఇప్పుడు మల్లికా కూడా తన లేటెస్టు చిత్రం 'అగ్లీ ఔర్ పగ్లీ'కి పారితోషికాన్ని షేర్ల రూపంలోనే తీసుకుంటుంది. ''ఈ సినిమాకు హీరో మల్లికానే'' అంటూ ఈ చిత్రం హీరో రన్‌వీర్ షోరీ కూడా ఒప్పుకున్నాడు. తొలుత తొమ్మిది కోట్లకు అమ్ముడు పోయిన ఈ చిత్రం మల్లికా ఉన్న ప్రోమోలు విడుదలవగానే 23 కోట్ల రేటు పలికింది. ఇది అంతా తన మహిమేనని మల్లికాకు తెలుసు. ఇప్పుడు తను అడిగినట్టు షేర్లలో వాటా ఇవ్వకపోతే తను సినిమా ప్రచారంలో పాల్గొనబోనని ఆమె నిర్మాతలను బెదిరించింది. దాంతో వారు దిగిరాక తప్పలేదు. ఏది ఏమైనా, బాలీవుడ్‌లోనే కాదు భారత దేశంలోనే పారితోషికాన్ని ఇలా షేర్ల రూపంలో అందుకున్న తొలి నటిగా మల్లికా పేరు సంపాదించేసింది.